"అంతవరకు మీకేమీ అభ్యంతరం లేకపోతే నా సైకిలు వాడుకోవచ్చు. మీదగ్గరే వుంచుకోండి దాన్ని. ఆ యిల్లు మాయింటికి దగ్గరేగా. ఎప్పుడైనా అవసరమైతే వచ్చి తీసుకుంటాను" అన్నాడతను.

'అత్యద్భుతమైన మనిషి' అనుకొని "అఁ ఎందుకండి ఇదేం దూరం కాదులెండి" అన్నాడు తను.

అతడు వినలేదు. దారిలో ఒక కుఱ్ఱాడిని పిలిచి ఇంటికివెళ్ళి సైకిలు తీసుకొని రమ్మని అప్పుడే చెప్పి పంపేశాడు. లక్ష్మణరావుకు ఏం చెప్పాలో తోచలేదు. ఇలాంటి పరిస్థితిలో వ్యక్తిత్వానికి భంగం రాకుండా ఎలా ప్రవర్తించాలో 'వ్యక్తిత్వము' అనే పుస్తకంలో రాసిన విషయాలు జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. వచ్చినా జ్ఞాపకం రాలేదు. కానీ అందులో 'ఈలాంటి మనుష్యులపట్ల చాల జాగ్రతగా వుండాలని, రాసినవిషయం మటుకు జ్ఞాపకం వచ్చింది!' ఏ ఉద్దేశంతో ఆ వ్యక్తి, ఇలాంటి సహాయం చేస్తున్నాడూ అని, ఆ ఎదుటవాడికి ఏమాత్రమూ, తను అనుమాన పడుతున్నట్లు అనుమానం కలుగకుండా, జాగ్రతగా బోధపరచుకొనే ప్రయత్నం చేయాలి!

ఇదరూ ఇంటిదగ్గరికి వచ్చారు. "వస్తానండీ సాయంకాలం మళ్ళీ వస్తాను. ఇల్లు మార్చేద్దాం" అంటూ రామదాసు చకచకా, అర్జెంటుగా నడిచి వెళ్ళిపోయాడు.

♦ ♦ 7

లక్ష్మణరావు ఊరువెళ్ళి భార్యను తీసుకువచ్చి కొత్తయింట్లో కాపురం పెట్టాడు. అన్ని సౌకర్యాలు కుదిరాయి.

